క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

బ్రహ్మసముద్రం : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు శుక్రవారం ముట్టడించారు. రైతులు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యారని అన్నారు. విద్యుత్‌కోతలతో రైతులను ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో సమయపాలన లేకుండా అరకొరగా1 లేదా రెండు గంటలు మాత్రమే త్రీ ఫేస్ ఇస్తున్నారని గుడిపల్లి ఫీడర్ పరిధిలో రైతులు వాపోయారు. మరోవైపు వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని, కనీసం 4 గంటలు విద్యుత్ సరఫరా చేయలేదని వాపోయారు. నాగిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కౌలు రైతులను గుర్తించాలి

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించాలని తహసీల్దార్ శ్రీనివాసులు వీఆర్వోలకు సూచించారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 260 మంది కౌలు రైతులను గుర్తించినట్లు ఆయన తెలిపారు.74 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందించామన్నారు. మిగిలిన వారిని గుర్తించి, సీసీ ఆర్సీ కార్డులు అందించాలని సూచించారు. డీటీ అనిల్‌కుమార్, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లతో నీటి ఆదా



మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి

కూడేరు: వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత తక్కువగా ఉన్నను డ్రిప్, స్ప్రింక్లర్లతో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించొచ్చని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గొటుకూరు గ్రామాన్ని సందర్శించి, రైతులతో సమావేశమయ్యారు. 2024–25 ఏడాదికిగాను ప్రభుత్వం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తుందని తెలియజేశారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్ఏ పుల్లప్ప, ఎంఐ ఏఓ దిలీప్ కుమార్, ఫినొలెక్స్ కంపెనీ ప్రతినిధులు బొమ్మినేని నాగరాజు, స్వప్నిల్ పాల్గొన్నారు.

రేరింగ్ షెడ్ల బిల్లులు మంజూరు చేయండి

కుందుర్పి: మండలంలోని నాగేపల్లి, వెంకటంపల్లి, జంబుగుంపల, కుందుర్పి తదితర గ్రామాల్లో రేరింగ్ షెడ్లు నిర్మించుకొని నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరుచేయలేదని రైతులు మారెన్న, భూషణ, హరి, చైతన్య తదితరులు ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎంపీడీఓను కలిసి సమస్య విన్నవించారు. సెరికల్చర్ అధికారులు నెలల తరబడి విధులకు హాజరుకాలేదని, కార్యాలయం వద్దకు వచ్చినా ఖాళీ కుర్చీలు ఉంటున్నాయని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటూ, కార్యాలయానికి రావడంలేదన్నారు.

పారిశుధ్య కార్మికుడికి చేయూత

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుడు వెంకటేశులుకు సచివాలయ సిబ్బంది చేయూతనందించారు. శుక్రవారం మున్సిపాల్ కార్యాలయంలో బాధితుడు వెంకటేశులు భార్య దుర్గమ్మకు రూ.14వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మున్సిపాల్ మేనేజర్ అశ్వర్థనారాయణ, మున్సిపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు



కూడేరు: మండల కేంద్రంలోని కలగళ్ల రోడ్డు మసీదు పక్కన భాస్కర్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలో బ్రహ్మకమలాలు విరబూశాయి. భాస్కర్ దంపతులు ఆ చెట్టుకు పూజలు చేశారు. ఒకే చెట్టుకు సుమారు 25 పుష్పాలు వికసించడం ఆనందంగా ఉందని భాస్కర్ తెలిపారు.

రేషన్ పంపిణీలో చేతివాటం సిగ్గుచేటు

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసే రేషన్ పంపిణీలోనూ డీలర్లు చేతివాటం ప్రదర్శించడం సిగ్గుచేటని దళిత నాయకులు ఆర్కే రాజు అన్నారు. శుక్రవారం కళ్యాణదుర్గంలో విలేకరులతో మాట్లాడారు. నారాయణపురం గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత కొందరు డీలర్లను తీసివేసి టీడీపీకి చెందిన వారికి డీలర్లుగా ఇచ్చారన్నారు. ఈ నెల నుంచి బియ్యాన్ని పంపిణీ చేయాల్సి ఉండగా, తూకాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఒక వ్యక్తి నుంచి రెండు నుంచి నాలుగు కిలోల బియ్యం వ్యత్యాసం ఉన్నట్లు గ్రామస్తులు చెప్తున్నారన్నారు.

వామ్మో..కూ‘డేర్’ చేయలేం

- తహసీల్దార్ బాధ్యతలు చేపట్టడం అనుమానమే..
- బాధ్యతలు తీసుకునేందుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం
- ఐదేళ్లలో ఇద్దరు తహసీల్దార్లు, ఆర్ఐ, వీఆర్ఓలు సస్పెండ్
- భూరికార్డులు సక్రమంగా ఉండవని అయిష్టత
- డిజిటల్ సంతకాల కోసం ప్రజల అవస్థలు



కూడేరు తహసీల్దార్ కార్యాలయం

కూడేరు: మండల మెజిస్ట్రేట్, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బందికి ఆయన బాస్.. జిల్లా కేంద్రానికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉండే కూడేరు మండలానికి తహసీల్దార్‌గా వెళ్లాలంటేనే హడలెత్తుతున్నారు.. జిల్లా కలెక్టర్ సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల తహసీల్దార్‌ను నియమించారు. గతంలో జరిగిన పరిణామాలు కొన్నయితే... స్వయానా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల సొంత నియోజకవర్గం కావడంతో ఒత్తిళ్లు అధికంగా ఉంటాయని భావిస్తుండడం మరో కారణం. గతంలో తహసీల్దార్లు, వీఆర్ఓలు, ఆర్ఐలు సస్పెండ్ అయ్యారని, భూరికార్డులు సక్రమంగా ఉండవని బాధ్యతలు తీసుకునేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో నంద్యాల జిల్లాకు చెందిన తహసీల్దార్ రత్న రాధిక బదిలీపై కూడేరు మండలానికి వచ్చారు. రెండు వారాల క్రితం జిల్లా కలెక్టర్ ఆమెను సొంత జిల్లాకు బదిలీ చేయడంతో రిలీవయ్యారు. వారంరోజుల క్రితం మోహన్‌కుమార్‌ను మండల తహసీల్దార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆయన శుక్రవారం వరకు బాధ్యతలు చేపట్టలేదు. ఆయన మండల తహసీల్దార్‌గా చేరడానికి సుముఖంగా లేరని ప్రచారం సాగుతోంది. 2019లో తహసీల్దార్, పలువురు వీఆర్వోలు, ఆ తర్వాత ఓ వీఆర్వో, ఆర్ఐ, రెండేళ్ల క్రితం తహసీల్దార్, వీఆర్వో సస్పెండ్ అయ్యారు. అక్కడ రికార్డులు సరిగా లేవు. పైగా ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గం. ఒత్తిళ్లు అధికంగా ఉంటాయని, ఇలాంటి పరిస్థితిల్లో బాధ్యతలు చేపడితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని మోహన్ కుమార్ వెనుకంజ వేస్తున్నట్టు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అనంతపురం రూరల్ మండలానికి వెళ్లేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

విద్యార్థులు, ప్రజలు అవస్థలు: రత్న రాధిక తహసీల్దార్‌గా రిలీవ్ అయ్యాక కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్‌కు ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాధ్యతలను అప్పగించడంతో ఆయన కేవలం మాన్యువల్‌గా సంతకాలు మాత్రమే చేస్తున్నారు. అనేక మంది విద్యార్థులు, ప్రజలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులు వీర్వో, ఆర్ఐ లాగిన్‌కు వచ్చాక వారు సంతకాలు చేస్తారు. తర్వాత తహసీల్దార్ డిజిటల్ సంతకం కీ ద్వారా సంతకం పెడితే దరఖాస్తుదారులు తిరిగి మీ సేవా కేంద్రాల్లో ఆ ధ్రువీకరణ పత్రాలను పొందొచ్చు. కానీ రెగ్యులర్ తహసీల్దార్‌గా నియమితులైన మోహన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించకపోవడంతో దరఖాస్తులు తహసీల్దార్ డిజిటల్ సంతకానికి నోచుకోలేక పోతున్నాయి. దీంతో విద్యార్థులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ తహసీల్దార్ త్వరగా విధుల్లోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

12 నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

కూడేరు: 2024–25 ఏడాదికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ, పరిశుభ్రతపై ఈ నెల 12 నుంచి 14 వరకు సర్పంచులకు , పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్ ట్రైనర్‌తో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారులు శుక్రవారం తెలిపారు.

12 నుంచి గుమ్మఘట్టలో..

గుమ్మఘట్ట: 2024–25 సంవత్సరానికి రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ వార్షిక కార్యచరణ ప్రణాళికలపై ఈనెల 12 నుంచి 14 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీఓ గౌరీదేవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, పారిశుధ్యం, చెత్త నుంచి సంపద తయారీ విధానంపై శిక్షణ ఉంటుందన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కుందుర్పి: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు గ్రామాల్లో శానిటేషన్, పారిశుధ్యం, వీధిలైట్లు ఏర్పాటు, పంచాయతీల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ ఉంటుందన్నారు.

బొమ్మనహాళ్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12,13,14 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ పరిపాలన నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ, ఎస్‌హెచ్‌జీ, పారిశుధ్యం, తాగునీరు, పంచాయతీ రాజ్ చట్టం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు.

12 నుంచి శెట్టూరులో..

శెట్టూరు: మండలంలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు వార్షిక ప్రణాళిక-2024–25 ప్రకారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓఆర్డీ రఘురాంరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుదన్నారు. రోజూ 16 గ్రామ పంచాయతీల నుంచి ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలన్నారు.

బ్రహ్మసముద్రంలో..

బ్రహ్మసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు 14 నుంచి శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ దాసానాయక్ , ఈఓఆర్డీ వెంకట్‌నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే శిక్షణకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలన్నారు.

నీటికోసం ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా?

- మండల మీట్‌లో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



మండల సమావేశంలో సమస్యలపై ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ యోగేంద్రరెడ్డి

ఉరవకొండ: పట్టణంతో పాటు గ్రామాల్లో ఏడాది కాలంగా తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొన్నా పట్టించుకోరా? అని ప్రజాప్రతినిధులు నిలదీశారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫామీదాబేగంను ఎంపీటీసీలు సీతారాముడు, వన్నూర్‌సాబ్‌లు నిలదీశారు. ఈసందర్భంగా సభ్యులు మాట్లాడుతూ తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నా తాము ప్రజలకు మోహం చూపించకుండా పోతున్నామన్నారు. ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు. పంపింగ్ ఆలస్యం కాకుండా చెరువులను నింపాలన్నారు. అనంతరం నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యాకానుక కిట్లు ప్రజాప్రతినిధులు తెలియకుండా ఎలా సరఫరా చేస్తారని ఎంఈఓ రమాదేవిని ప్రశ్నించారు. మండల సమావేశాలకు అధికారులు కనీస సమాచారం లేకుండా ఎలా వస్తారని ప్రశ్నించారు. అనంతరం విద్యుత్, వ్యవసాయ శాఖల అధికారులను కూడా సభ్యులు పలు అంశాలపై నిలదీశారు. జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, తహసీల్దార్ మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

అందుబాటులోకొచ్చిన రైల్వేస్టేషన్ భవనం



రాయదుర్గంలోని నూతన రైల్వేస్టేషన్ భవనం

రాయదుర్గంటౌన్: దాదాపు 120 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రాయదుర్గం రైల్వే స్టేషన్ శుక్రవారం నూతన భవనంలోకి మారింది. పాత భవనానికి పక్కనే రూ.9.2 కోట్లతో (ప్లాట్‌ఫాం విస్తరణ, ఇతర అభివృద్ధి పనులు) ఏర్పాటైన భవనం 13 ఏళ్ల తర్వాత పూర్తయ్యింది. శుక్రవారం రైల్వే అధికారులతో పాటు రైల్వే కన్‌స్ట్రక్షన్ అధికారులు హాజరై భవనంలో ఏర్పాటైన అధునాతన రైళ్ల రాకపోకల సిగ్నలింగ్ వ్యవస్థతో రైళ్ల రాకపోకలను ప్రారంభించారు. నూతన రైల్వే స్టేషన్ అందుబాటులోకి తెస్తున్న విషయాన్ని మీడియాకు గాని, ప్రజాప్రతినిధులకు గానీ అధికారికంగా సమాచారం ఇవ్వకపోవడం విశేషం. పూర్తిస్థాయిలో ప్రయాణికులకు రైల్వే సేవలు నూతన భవనంలోనే అందనున్నాయి. చాలా కాలం తరువాత నూతన రైల్వే స్టేషన్‌ను ప్రారంభించినా ప్రయాణికులకు బాత్‌రూములు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా లేకపోవడం కొసమెరుపు. నూతన రైల్వేస్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు కారణంగా శుక్రవారం రాయదుర్గం మీదుగా ప్రయాణించే చిక్కజాజూరు–గుంతకల్లు, హొస్పేట–బెంగళూరు మధ్య ప్రయాణించే మూడురైళ్లను ఇతర మార్గం ద్వారా మళ్లించారు. ఇదిలా ఉండగా స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాం విస్తరణ, మరోలైన్ ఏర్పాటు, నీటి ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలకు రూ.8.7 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచినట్లు అధికారులు తెలిపారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ వసతి కల్పించాలి

రాయదుర్గం జంక్షన్‌లో ప్రస్తుతం నూతన రైల్వేస్టేషన్, ప్లాట్ ఫాం అందుబాటులోకి వచ్చినందున ఇప్పుడైనా రాయదుర్గం మీదుగా రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. మైసూరు–వారణాసి, యశ్వంత్‌పూర్–జైపూర్, యశ్వంత్‌పూర్–టాటానగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల వెళుతున్నప్పటికి స్టాపింగ్ లేదని, వాటిని ఆపాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

కూడేరు: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సౌమ్యా రెడ్డి తెలిపారు. శుక్రవారం కూడేరులోని పీహెచ్‌సీలో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం (పీఎంఎంవీవై) కింద హైరిస్క్ గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది దాకా హైరిస్క్ గర్భిణులు వచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయమైన చర్య



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

శెట్టూరు: అమరావతి నడిబొడ్డున సామాజిక న్యాయ మహా శిల్పంపై పచ్చమూకలు దాడి చేయడం నీచ సంస్కృతికి నిదర్శమని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నారు. అంబేడ్కర్ విగ్రహంపై దాడికి నిరసనగా నాయకులు శెట్టూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. రాజ్యాంగ నిర్మాతను గౌవరవించే విధంగా గత ప్రభుత్వం అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం దాన్ని జీర్ణించుకోలేక కుట్రపూరితంగా మహాశిల్పానికి ఉన్న బోర్డును ధ్వంసం చేసి, విగ్రహంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి చర్యలు మానుకోవాలన్నారు. మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు రామకృష్ణ, ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, హరినాథ రెడ్డి, రామాంజనేయులు, రఘు, గోపి, గోవిందు,రామకృష్ణ, బాబు పాల్గొన్నారు.

రైతులు ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ



75 వీరాపురంలో ఈ పంట నమోదు చేయిస్తున్న ఉద్యాన అధికారిణి మౌనిక

కళ్యాణదుర్గం రూరల్: సెప్టెంబర్ 15లోపు ఉద్యాన, ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదు చేసుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ యల్లప్ప, ఉద్యాణ శాఖ అధికారి కృష్ణతేజ మాట్లాడుతూ, రైతులు ఉద్యాన శాఖ పథకంలో 40 శాతం, 50 శాతం వరకు సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు ఏన్ఆర్ఈజీఎస్ పథకం కింద పిట్టింగ్, ప్లాంటేషన్‌పై రైతులకు అవగాహన కల్పించాలని ఆర్ఎస్‌కే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీ ఉష, పీడీ మద్దిలేటి, ఉద్యాన అధికారులు ఏఈఓలు, కుందిర్పి, కంబదూరు, బ్రహ్మసముద్రం, శెట్టూరు, బెలుగుప్ప ఆర్ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిణి మౌనిక తెలిపారు. మండలంలోని 75 వీరాపురం సమీపంలో ఉద్యానవన పంటలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందిస్తున ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. గ్రామాల్లో ఆర్ఎస్ కే కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి, ఈ పంట నమోదు చేసుకోవాలన్నారు.

రైతులు ఈక్రాప్ నమోదు చేయించాలి

కుందుర్పి: ఖరీఫ్‌లో మెట్ట భూముల్లో వర్షాధారం కింద సాగుచేసిన అన్ని పంటలను ఈక్రాప్ నమోదు చేయించాలని ఏఓ మహేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వడ్డెపాళ్యం, బసాపురం, ఎర్రగుంట పంచాయతీల్లో ఆర్బీకే సిబ్బందితో కలిసి వ్యవసాయ అధికారి రైతుల పొలాల్లో సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గోవి, అపర్ణ, అనిల్, మౌనిక, తిమ్మరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ మునివేలును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మునివేలుకు వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ మునివేలు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ పరమేశ్వర, తిప్పేస్వామి, నాయకులు వన్నూరుస్వామి, వంశీ, బసవరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అపహరణ

కణేకల్లు: కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రి వద్ద గురువారం రాత్రి బైక్ (ప్యాషన్) చోరీ అయ్యింది. రాయదుర్గం మండలం కొండాపురానికి చెందిన ప్రభాకర్ తన భార్య నళినితో కలిసి ఆర్డీటీ ఆస్పత్రికి వచ్చాడు. రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్రవాహనాన్ని ఆర్డీటీ ఆస్పత్రి బయట పార్కింగ్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్ల తెలిపాడు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

బెళుగుప్ప: కాలువపల్లికి చెందిన సుగాలి ఆంజనేయులు కొన్ని రోజులుగా కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రోజులు గడుస్తున్నా తిరిగి ఇంటికి రాకపోవడంతో సుగాలి ఆంజనేయులు నాయక్ బావ మిట్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

లింగ వివక్షపై అవగాహన సదస్సు

వజ్రకరూరు: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో లింగవివక్షపై శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి సర్దార్‌వలి మాట్లాడుతూ స్త్రీ,పురుషులు ఇద్దరూ సమానమేనని, భ్రూణహత్యలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ,హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు

విడపనకల్లు: మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో 2024 ఖరీఫ్‌నకు సంబంధించి ఈక్రాప్ నమోదు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. వీఏఏ కుళ్లాయిస్వామి నాయక్, సర్వేయర్ నాసిర్ హుస్సేన్, వీఆర్వో సునీత పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బొమ్మనహాళ్: మండల పరిధిలోని దేవగిరి క్రాస్ వద్ద బళ్లారి–కళ్యాణదుర్గం రహదారి పక్కన ఉన్న చింత చెట్టు శుక్రవారం మధ్యాహ్నం విరిగిపడింది. అయితే ఆసమయంలో అక్కడ ఎవరూలేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.

14న మండల సర్వసభ్య సమావేశం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 14న ఉదయం 11 గంటలకు మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం ఉంటుందని ఎంపీడీఓ విజయలలిత ఓ ప్రకటనలో తెలిపారు.

వైస్ ఎంపీపీకి మాతృ వియోగం



భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

శెట్టూరు: వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప తల్లి లింగమ్మ (82) వయోభారంతో శుక్రవారం మృతిచెందింది. లింగమ్మ భౌతికకాయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించి, నివాళులర్పించారు. మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచులు బొమ్మజ్జి రమేష్, రామకృష్ణ, నాయకులు హరినాథ రెడ్డి, ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, రామాంజనేయులు, రఘు, మహ్మద్, గోవిందు పాల్గొన్నారు.

వ్యవసాయ వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి

వజ్రకరూరు: వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలకు కేంద్రం ప్రభుత్వం స్వస్తి పలకాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూ పాక్షి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక మెయిన్ బజార్‌లోని గాంధీ విగ్రహం వద్ద కార్పొరేట్స్ క్విట్ ఇండియా నినాదంతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి, నాయకులు సత్యప్రకాష్, షెక్షావలి, బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

ఉరవకొండ: అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండలోని రంగావీధికి చెందిన హుస్సేన్‌పీరా పెద్ద కుమారుడు మహమ్మద్ రఫీ (24) ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం రూ.2 లక్షలు అప్పు చేసి ఎలక్ట్రికల్ సామగ్రిని కొనుగోలు చేసి ఇంట్లో డంప్ చేశాడు. అయితే ఒక్క సామగ్రి కూడా అమ్ముడు పోకపోవడంతో అప్పులకు వడ్డీ భారం పెరుగుతూ వచ్చింది. దీంతో అప్పులు తీర్చే మార్గం కానరాక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఉరవకొండ సీఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రెవెన్యూ సిబ్బందితో ఆర్డీఓ సమావేశం



తహసీల్దార్‌తో చర్చిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి

ఉరవకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఇతర సిబ్బందితో ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఏ ప్రభుత్వ కార్యాలయమైనా ఐఎస్ఓ గుర్తింపు పొందాలంటే 39 రకాల ప్రమాణాలు అవసరమని, ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో అదనంగా మూడు కలిపి 42 ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. ఇందులో సమావేశ మందిరాల వద్ద కొటేషన్లు, పోస్టర్లు, గదులు, చాంబర్లు, హోదా బోర్డులు, రికార్డు రూమ్ నిర్వహణతో పాటు అనేక కార్యక్రమాలు సిద్ధం చేయాలన్నారు. ఇది వరకే గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్ మంజూరయ్యిందన్నారు. ప్రస్తుతం ఉరవకొండ ఈ–సర్టిఫికెట్ కోసం సిద్ధం చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



ఉరవకొండ తహసీల్దార్‌ను సత్కరిస్తున్న జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీలు

ఉరవకొండ: మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ మహబూబ్‌బాషాను జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, నాయకులు పవన్ తదితరులు కోరారు. శుక్రవారం ఉరవకొండ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మహబూబ్‌బాషాను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉరవకొండ పరిధిలోని పలు ప్రధాన సమస్యలపై తహసీల్దార్‌తో మాట్లాడారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం



అన్నం వడ్డిస్తున్న తహసీల్దార్ బాలకిషన్

కంబదూరు: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితమని వైద్యాధికారి ఆసియా తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ పథకంలో భాగంగా 42 మంది గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందించారు. డాక్టర్ ఆసియా మాట్లాడుతూ గర్భిణులు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భిణులకు మాజీ వైస్ ఎంపీపీ తలారి ఎర్రిస్వామి కుటుంబం భోజన సౌకర్యం కల్పించారు. తహసీల్దార్ బాలకిషన్ గర్భిణులకు భోజనాలను వడ్డించి, దాత ఎర్రిస్వామిని అభినందించారు.

శ్రావణ శుక్రవార పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రముఖ ఆలయాలతోపాటు అమ్మ వారి ఆలయాల్లో శ్రావణమాసం పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. తొలి శుక్రవారం పట్టణంలోని వాసవీమాత ఆలయం, నేసేపేట, కళ్లీమఠం హైస్కూల్ వద్ద గల మహాలక్ష్మీ, మల్లాపురం లేఅవుట్‌లోని గజలక్ష్మీ ఆలయం, బన్నీ మహంకాళి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

లోక కల్యాణ మహోత్సవం

బెళుగుప్ప: మండల పరిధిలోని రమణేపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో లోక కల్యాణ మహోత్సవం, అభిషేకాలు శుక్రవారం నిర్వహించారు.

నందివాహనంపై ఊరేగిన వీరభద్రస్వామి

విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కమిటీ అధ్యక్షుడు రుద్రప్ప, ఆలయ కమిటీ ఈఓ రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నందివాహన సేవ నిర్వహించారు.

చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

కుందుర్పి: మండల కేంద్రంలోని చౌడేశ్వరి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంబుగుంపల అటవీప్రాంతంలోని కొండ్లో మారెమ్మ, బెస్తరపల్లి సవారమ్మ, కదరంపల్లి దుర్గాదేవి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు చేశారు.

ఘనంగా నాగదేవత విగ్రహాల ప్రతిష్ట

కణేకల్లు: కణేకల్లులోని ముల్లావారి వీధిలో శుక్రవారం నాగదేవత విగ్రహాల ప్రతిష్ట ఘనంగా జరిగింది. ముందుగా అర్చకులు శాస్త్రోక్తంగా వాస్తు హోమం, సుదర్శన, నవగ్రహ, అక్లేశబలి, ప్రతిష్ట హోమాలు నిర్వహించారు. ఆ తర్వాత నాగదేవత విగ్రహాలను ప్రతిష్టించారు.

భక్తిశ్రద్ధలతో నాగపంచమి

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో నాగపంచమి వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. స్థానిక సీతారామస్వామి ఆలయంలో నాగపంచమి వేడుకలు నిర్వహించారు.